

తిరుమలకు చేరుకున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా



ప్రజాశక్తి -తిరుమల: కేంద్ర హోం మంత్రి అమిత్ షా శ్రీవారిని దర్శించుకోవడానికి గురువారం రాత్రి 7.20 గంటలకు తిరుమలకు చేరుకున్నారు. అతిథి గహానికి చేరుకోగానే అధికారులు స్వాగతం పలికి బస ఏర్పాట్లను చేశారు. రాత్రికి అక్కడే బస చేసి శుక్రవారం ఉదయం 8.25 గంటలకు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. అమిత్ షా పర్యటన సందర్భంగా తిరుమల తిరుపతిలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేసారు. ఎన్నికల ఫలితాలకు ముందు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తిరుమల శ్రీవారిని దర్శించుకోవటానికి రావటం ప్రాధాన్యత సంతరించుకుంది.

రేపటి నుంచి రోడ్ సేఫ్టీ కొత్త చట్టం అమలు

అతిక్రమిస్తే జరిమానా, జైలు శిక్ష


ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఏపి రోడ్‌సేఫ్టీ సవరించిన చట్టం జూన్ ఒకటో తేదీ నుండీ అమల్లోకి రానుంది. మారిన రోడ్‌సేఫ్టీ చట్టం ప్రకారం రోడ్డురవాణా నింధనలు అతిక్రమించిన వారికి భారీ జరిమానాలు విధించడంతో పాటు జైలుశిక్షను కూడా విధించనున్నారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరిత్య నేరం ఇలా మైనర్లకు వాహనాలు ఇచ్చి పట్టుబడితే వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ మైనర్లతో పాటు వాహనం ఇచ్చిన వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు రూ. 25వేల జరిమానా మూడు సంవత్సరాల జైలు శిక్ష, వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేయనున్నారు. తాగి వాహనాలు నడిపితే రూ.10వేలు జరిమానా లేదా 6నెలల జైలు శిక్ష విధించనున్నారు. రహదారి, ట్రాఫిక్ నియమనిభంధనల ఉల్లంఘనలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ సవరించిన కొత్త చట్టం ప్రకారం వాహనదారులకు జరిమానా, శిక్షలు జూన్ 1వ తేదీ నుండి అమలు కానున్నాయి.

సవరించిన చట్టం ప్రకారం జరిమానాలు, శిక్షలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల జీవో నెంబర్ 21 ఎంవి యాక్టులోని సెక్షన్ 200 ప్రకారం నిబంధనలను ఉల్లంఘించ వారిపై విధించే జరిమానాలు భారీగా పెంచింది. జూన్ ఒకటో తేది నుండీ సవరించిన ఎంవి కాక్టు సెక్షన్ 200 అమలుకానుంది. సరివరించిన రోడ్డు భద్రతా నియమాలు పాటించకుంటే భారీ జరిమానాలు, జైలు శిక్షలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

సవరించిన ఎంవి యాక్టు ప్రకారం జూన్ ఒకటో తేది నుండీ డ్రైవింగ్ లైసెన్స్



లేకుండా వాహనం నడిపితే రూ.5వేల జరిమానా, మైనర్లు వాహనం నడిపితే రూ.10 వేలు, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే మొదటి సారి రూ. 1,500, రెండోసారి అదే తప్పుచేసి పట్టుబడితే రూ.10వేలు జరిమానా విధించనున్నారు. మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడితే మొదటిసారి రూ.10వేల జరిమానా ఆరు నెలల జైలుశిక్ష, రెండోసారి అదే తప్పు చేస్తే రూ.15వేల జరిమానా మూడు సంవత్సరాలు జైలుశిక్ష, రేసింగ్ అతివేగంగా వాహనం నడిపితే మొదటిసారి రూ. 5వేల జరిమానా, మరో సారి చేస్తే రూ.10వేల జరిమానా విధిస్తారు. శబ్దం, వాయుకాలుష్యం చేస్తే ఎల్ఎంవి తక్కువ గల వాహనాలకు రూ.1,500, ఎల్ఎంవి ఎక్కువ గల వాహనాలకు రూ.3వేలు జరిమానా, వాహన రిజిస్ట్రేషన్ లేకుండా నడపడం, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేకుండా వాహనం నడిపితే మొదటిసారి రూ. 2వేల, రెండోసారి రూ. 5వేల జరిమానా, పర్మిట్ లేకుండా నడిపితే రూ.10వేలు, అనుమతించిన బరువు కంటే అధిక లోడ్‌తో వాహనం నడిపితే రూ. 20వేల జరిమానాతో పాటు అదనపు టన్నుకు రూ.2వేల చోప్పున జరిమానా చెల్లించాల్సి ఉటుంది. హెల్మెంట్ ధరించకుంటే వెయ్యి రూపాయలు, అగ్నిమాపక వాహనం, అంబులెన్స్‌కు దారి ఇవ్వకుంటా రూ.10వేల జరిమానా చెల్లించాలి. ఇన్యూరెన్స్ లేకుండా వాహనం నడిపితే మొదటిసారి రూ.2వేలు, రెండో సారి చేస్తే 4వేల జరిమానా విధించనున్నారు. మైనర్లు వాహనాలు నడిపితే సంరక్షకుడు యజమాని దోషిగా పరిగణించబడతారు. కోర్టు ద్వారా రూ. 25వేల జరిమానాతో పాటు 3 సంవత్సరాలు జైలు శిక్ష, మోటరు వాహనం రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుంది.

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద

పటిష్టంగా బ్యారికేడింగ్ వ్యవస్థ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పకడ్బందీగా త్వరితగతిన ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షణ్మోహన్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా జూన్ 4న జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి చిత్తూరు జిల్లాకు కౌంటింగ్ సెంటర్ ఎస్‌వి సెట్‌లో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్, 172 చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులుతో కలసి కలెక్టర్ పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా కౌంటింగ్ సెంటర్‌లో బ్యారికేడింగ్, ఫుడ్‌కోర్టు, తాగునీరు ఏర్పాటు, శ్యానిటేషన్, పార్కింగ్, మీడియా సెంటర్, సిసి కెమెరాల ఏర్పాటు, సూచిక బోర్డుల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. మొదటగా ఓట్లలెక్కింపు కేంద్రాలలో ఏర్పాటు చేసిన టేబుళ్ల అమరిక, కంప్యూటర్లుఏర్పాటు, ఏజెంట్‌లకు అవసరమైన సీటింగ్ ఏర్పాటు, తదితర అంశాలన్నింటినీ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో తగు భద్రతా ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని, పూర్తి నిఘానీడలో ఓట్ల లెక్కింపుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఓట్ల లెక్కింపుకు కేటాయింపబడ్డ సిబ్బంది వారికి కేటాయించ బడిన కౌంటింగ్ హాల్‌కు సులువుగా చేరుకునే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, తాగునీరు అనుమతి లేదని కౌంటింగ్ కేంద్రం వెలుపల తాగునీటిని ఏర్పాటు చేయాలని, ఫోన్లులు డిపాజిట్ చేసుకునేందుకు కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా ఆర్‌ఓలు ముందస్తుగా వారి నియోజకవర్గాలలో ఏర్పాట్లను పరిశీలించుకుని ఎక్కడా లోటుపాట్లు లేకుండా అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అల్పాహారం, భోజనం ఏర్పాట్లకు సంబంధించి ఏజెంట్లకు, కౌంటింగ్ సిబ్బంది, మీడియాకు వేరువేరుగా కౌంటర్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా కౌంటింగ్ కేంద్రంను పరిశు భ్రంగా ఉంచాలన్నారు. మీడియా సెంటర్‌లో ఎల్ఈడి స్క్రీన్, టీవీలు, కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా చిత్తూరు (ఎస్‌సి) పార్లమెంటరీ నియోజకవర్గం, ఏడు నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాలలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. దీనితోపాటు ఈవీఎంలను, పోస్టల్ బ్యాలెట్‌లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట పిఆర్, ఆర్ అండ్ బి ఎస్‌సిలు చంద్రశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, పూతలపట్టు ఆర్‌ఓ చిన్నయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్

అసభ్యకరమైన సందేశాలు పోస్ట్ చేయకండి : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్



'సమాజంలో శాంతి, సమరసతని కాపాడటం మనందరి బాధ్యత' సోషల్ మీడియా లేదా వాట్సాప్‌లలో ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే సందేశాలు, ఫోటోలు పోస్ట్ చేస్తే గ్రూప్ అడ్మిన్స్ వారే పూర్తి భాద్యత వహించాలని జిల్లా ఎస్పి మణికంఠ చందోలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ తరువాత ఎటువంటి విద్వేషాలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదు. ఒక్క క్లిక్‌తో కలకలం సష్టించవద్దు, మంచి సందేశాలు పంచుకోవాలని సూచించారు. ప్రతి గ్రూప్ అడ్మిన్ సరైన సందేశాలు మాత్రమే పంచే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రూప్ అడ్మిన్ వారి గ్రూప్‌లో నిబంధనలను ఖచ్చితంగా పాటించేలా చూసుకోవాలని, వివాదాస్పద విషయాలు లేదా తప్పుదారిపట్టించే సమాచారం పంపినవారిని గ్రూప్ నుండి వెంటనే తొలగించాలన్నారు. స్వేచ్ఛకు ఒక పరిమితి ఉంటుందని, అది సమాజ హితానికి అవరోధం కాకూడదని, ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా వేదికలను సమాజసేవకు వినియోగించుకోవాలని అన్నారు.

పాలిసెట్- 2024

కౌన్సెలింగ్ షెడ్యూల్ మార్పు

ప్రజాశక్తి - పలమనేరు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జూన్ మొదటి వారంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు 144 సెక్షన్ కారణంగా విద్యార్ధులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా విద్యార్థులు, వారి తల్లి దండ్రుల నుండి వచ్చిన వినతుల మేరకు పాలిసెట్ -2024 అడ్మిషన్ల ప్రక్రియలో మార్పులు చేసి సవరణ నోటిఫికేషన్‌ను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి విడుదల చేశారు. దాని ప్రకారం ముందుగా ప్రకటించినట్టే ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ వంటి ఆన్లైన్ ప్రక్రియకు జూన్ 2 వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. అయితే జూన్ 3న జరగాల్సిన సర్టిఫికెట్ పరిశీలనను 6వ తేదీన (ప్రత్యేక కేటగిరి అభ్య ర్థులకు కూడా) నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆప్షన్ల నమోదుకు 7 నుంచి 10వ తేదీ వరకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. 11న విద్యార్థులు ఇదివరకే నమోదు చేసిన ఆప్షన్లను మార్పు చేసుకొనుటకు అవకాశం కల్పిస్తామన్నారు. 13న సీట్లు కేటాయింపు జరుగుతుందని వివరించారు. 14వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా తరగతులు ప్రారంభమవుతాయని, సీట్లు పొందిన విద్యార్థులు 19వ తేదీలోగా కళాశాలల్లో రిపోర్టు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ తెలియజేశారు.

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా కేంద్రంలోని గిరింపేటలోని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంజీవరం సురేంద్రన్ ఆధ్వర్యంలో 54వ సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970 సంవత్సరంలో కలకత్తా నగరంలో మే30న సిఐటియు ఆవిర్భవించిందని తెలిపారు. త్యాగం, పోరాటం నినాదంతో 54 సంవత్సరాలుగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సిఐటియు నిర్వహిస్తూ ఉందని చెప్పారు. ఉద్యోగులు, స్కీం వర్కర్లు, హమలి వర్కర్స్, ఆప్కాస్, కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలపై సిఐటియు పనిచేస్తుందని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో కరువు, ఆపద వచ్చినప్పుడు సిఐటియు స్పందిస్తుందని పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు ఉద్యోగులకు వ్యతిరేకంగా నిర్ణయాలు చేసినప్పుడు వాటిపై పెద్దఎత్తున సమ్మెలో నిర్వహించిందని తెలిపారు. దేశంలో సమ్మె నిర్వహించినప్పుడు కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వ సంస్థలను కాపాడాలని సిఐటియు పోరాటం నిర్వహిస్తుందన్నారు. ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, రైల్వే, డిఫెన్స్, బ్యాంకులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తూ ఉందనే పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం వచ్చే ప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కార దిశగా ఆలోచించే విధంగా ఉండాలని కోరారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఆనంద, రాజయ్య గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సిఐటియు జెండా ఎగురవేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర

పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలి..

డిఆర్ఓ పుల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ పుల్లయ్య

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో ఒక్కరూ కూడా బాలకార్మికులు ఉండకూడదని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం ఉదయం డిఆర్ఓ ఛాంబర్‌లో జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకార్‌రావుతో కలిసి జిల్లాలో బాల కార్మికుల నిర్మూలనపై జూన్ 1 నుండి 30 వరకు జిల్లాలో నిర్వహించే డ్రైవ్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం డిఆర్ఓ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో బాలకార్మికులు అనేది లేకుండా నిర్మూలించడానికి జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎక్కడైనా బాల పనిచేస్తుంటే వారిని ఆ పని నుండి విముక్తులు చేయాలన్నారు. బాలలను పనిలోకి పంపించడం నేరమవుతుందని, బాలలను బడికి పంపించాలని, ప్రభుత్వాలు పిల్లల చదువు కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తుందన్న విషయాన్ని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. ఎక్కడైనా పనిలో ఉంటే ఆ బాలలను బడిలో చేర్పించాలన్నారు. ఎవ్వరైనా 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే అలాంటి యజమాన్యంపై క్రిమినల్ కేసుతోపాటు జరిమానా, కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా బాలకార్మికులు పనిచేస్తుంటే వారికి సంబంధించి 1098 కాల్‌చేసి తెలియజేయాలన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఐసిడిఎస్, పోలీస్, మెడికల్ శాఖలధికారులు, సమన్వయం చేసుకొని మండలస్థాయిలో కూడా బాల కార్మిక నిర్మూలనపై క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. సమావేశం సహాయ కార్మిక అధికారులు జగదీష్ బాబు, మధు బాబు, దిశ పోలీస్ ఎస్ఐ నాగశైలజ, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ నాగమణి, డిఎల్ఎస్ఏ నుండి శ్రీదేవి, డిప్యూటీ డిఎం హెచ్ఓ వెంకట ప్రసాద్, పిల్ల సంరక్షణ అధికారి శివ కుమార్ పాల్గొన్నారు.

12 నుంచి పాఠశాలల గుర్తింపు పునరుద్ధరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

వచ్చే నెల 12వ తేదీ నుంచి ప్రయివేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల గుర్తింపు పునరుద్ధరణ ప్రతిపాదనలు, 2024-2025 విద్యా సంవత్సరానికి పాఠశాలలను పునఃప్రారంభించే గుర్తింపు కోసం ఏవైనా ప్రతిపాదనలు పెండిగ్‌లో వుంటే వెంటనే జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు తెలిపారు. గుర్తింపు పునరుద్ధరించుకోకుంటే పాఠశాల గుర్తింపు రద్దు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 12వ తేదీ తరువాత గుర్తింపు పునరుద్ధరించుకోని పాఠశాల గుర్తింపు రద్దు చేయనున్నట్లు హెచ్చరించారు.

పంటలపై కొనసాగుతున్న గజ దాడులు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ గట్టువారిపల్లి పరిసర ప్రాంతాలలో బుధవారం అర్ధరాత్రి 13 ఏనుగుల గుంపు పంట పొలాలపై సంచరిస్తూ టమోటా, మామిడి, వంకాయ, వరి పంటలను ధ్వంసం చేస్తూ సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్టు రైతులు చెబుతున్నారు. గురువారం ఉదయం గట్టువారిపల్లికి చెందిన లక్ష్మయ్యకు చెందిన టమోటా, మామిడి పంటలపై దాడి చేయడంతో దాదాపు రెండు లక్షల రూపాయల నష్టం జరిగినట్టు తెలిపారు. ఎస్.రాజాకు చెందిన వరి పంటను తొక్కి వేయడంతో నష్టం జరిగినట్లు తెలిపారు. దేవా, సీతారామయ్య తదితర రైతుల పంటలపై దాడిచేసి తొక్కి వేసినట్టు తెలిపారు. ఎఫ్ఆర్‌వో బాలకష్ణారెడ్డి, ఎఫ్ఎస్ఓ సురేంద్ర, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ షాజహాన్ ఇతర అటవీశాఖ సిబ్బంది సంఘటనా స్థలాలను పరిశీలించి నష్టపోయిన పంటల వివరాలు తెలియజేస్తూ రైతులు తహశీల్దారుకు అర్జీలు ఇస్తే నష్టపరిహారం అందించే విధంగా కషి చేస్తామని తెలిపారు.




- ఏనుగుల పాదముద్రలు - పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

స్థానిక ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళశాల్లో భద్రపరిచిన ఓటింగ్ యంత్ర పరికరాల స్ట్రాంగ్ రూమ్‌ల ముందు ప్రాంతం పరిసరాలను, కంట్రోల్ కమాండింగ్ సిస్టంను గురువారం చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్ పరిశీలించారు. కౌంటింగ్ ప్రాంతంలఎ భద్రతా నిఘా వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో ఉన్న నిఘా విభాగంనకు సంబంధించిన అధికారులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు విషయంలో కచ్చితంగా వారివారి విధులు నిర్వహించాలని కోరారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ముందు ప్రాంతం అంతా రాత్రివేళల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.



కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న సిఆర్ రాజన్

వైద్య రంగంలో డాక్టర్ రవిరాజు సేవలు పదిలం..

సుదీర్ఘకాలంపాలు వైద్యసేవలు

నేడు డాక్టర్ రవిరాజు పదవీ విరమణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

చిత్తూరు జిల్లాలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిరాజు అంటే పరిచయం అవసరం లేని వ్యక్తి. విధినిర్వహణలో పరిధికి మించి ఆంత్రాక్స్ వంటి ప్రమాదకర వ్యాధిని ఆదిలోనే గుర్తించి పలువురి ప్రాణాలు కాపాడి అధికారులు అనధికారుల మెప్పులను, మెడల్స్‌ను అందుకున్నారు. కోవిడ్ సమయంలో ప్రాణభయం వెరపు లేకుండా బాధితులకు సేవలను అందించారు. ప్రభుత్వ వైద్యాధికారుల సంఘానికి నేతత్వం వహించి దిశాదశ నిర్దేశం చేశారు. వద్ధుల ఆరోగ్యానికి నడకే సరైన మందు అని సామాజికపరంగా వద్ధులను చైతన్యపరచి సంఘటిత పరచి ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్‌కు సారధి వ్యవహరించారు.

జిల్లాలోని కార్వేటినగరం మండలం ఆర్‌కెవిబి పేటలో రుక్కమ్మ, శీరంగరాజులకు 1962లో రవిరాజు జన్మించారు. బీఎస్సీ ఎంబీబీఎస్సీలను చేసిన ఆయన అనురాధను వివాహమాడి ఆశ్రిత, నవ్యతలకు జన్మనిచ్చి ఆ ఇద్దరు కుమార్తెలను తనదారిలోనే డాక్టర్లను చేయడం విశేషం.

ప్రభుత్వ శాఖలో ప్రవేశించక ముందు కొద్దికాలం ఆస్ట్రేలియాలో అక్కడి ప్రజలకు వైద్యసేవలను అందించారు. తనను వైద్యునిగా తీర్చిదిద్దిన పుట్టినగడ్డ రుణం తీర్చుకునేందుకు సంకల్పించి తిరిగి ఇక్కడికి చేరుకుని ప్రభుత్వ డాక్టర్‌గా వైద్యప్రస్థానాన్ని చేపట్టారు. కార్వేటినగరంలో పనిచేసే రోజుల్లో పశువులకు సోకే ఆంత్రాక్స్ వ్యాధి మనుషులకు సోకడంతో వెంటనే గుర్తించి ఆదిలోనే అంతం చేసి పలువురు ప్రాణాలను కాపాడారు. అలాగే చక్కెర వ్యాధి మీద యుద్ధం ప్రకటించి పెద్దఎత్తున వైద్యపరీక్షలు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రికార్డు స్థాయిలో పుత్తూరులో ప్రసవ ఆపరేషన్ నిర్వహించారు. ప్రాణాంతకమైన కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి జిల్లా అంతటా వైద్యసేవలతో పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ చురుకుదనం గుర్తించిన ప్రభుత్వ డాక్టర్ల బందం జిల్లా ఐఎంఏ సంఘానికి సారథ్యం వహించే అవకాశం కల్పించారు. ఇందులోనూ తనదైన శైలితో సంఘానికి సేవలు అందించి ప్రశంసలు అందుకున్నారు. ప్రభుత్వ వైద్యునిగా బిజీగా ఉంటూ మరో పార్శ్వంలో సంపూర్ణ ఆరోగ్యానికి నడకే మూల మంత్రమని విశ్వసించి పుత్తూరులో మిత్రులతో కలిసి వాకర్స్ అసోసియేషన్‌లో తన వంతు పాత్రతో ప్రవేశించి అంచలంచెలుగా ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్‌కు సారధిగా నిలిచారు. వైద్యునిగా బహుముఖ పాత్రలో నిలిచిన డాక్టర్ రవిరాజు 2024 మే 31వ తేదీన సాంకేతికంగా జిల్లా వైద్యాధికారి స్థాయిలో పదవీవిరమణ చేయనున్నారు. వైద్యునిగా ప్రభుత్వశాఖలో పాత్ర లేకపోయినా పుత్తూరు పరిసర ప్రాంతాల్లో పేదల డాక్టర్‌గా స్థిరస్థానాన్ని సంపాదించిన ఆయన జీవితాంతం వైద్యసేవలు అందించేందుకు సాయిబాబా వీధిలో ప్రజావైద్యశాలను ఏర్పాటు చేసుకున్నారు. సుదీర్ఘకాలం వైద్యసేవలంచిన డాక్టర్ రవిరాజు నేడు ఉద్యోగ విరమణ చేయనున్నారు.



డాక్టర్ రవిరాజును సన్మానిస్తున్న డిఎంఅండ్‌హెచ్ఒ, వైద్య బృందం

నేడు వాహనాల వేలం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు


పలు కేసులలో పట్టుబడ్డ 11 ద్విచక్ర వాహనాలను వేలం వేయనునట్లు గంగాధర నెల్లూరు సిఐ మారుతి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగాధర నెల్లూరు పోలీస్ స్టేషన్లో పలు కేసులలో పట్టుబడ్డ 11 ద్విచక్ర వాహనాలను శుక్రవారం ఉదయం అధికారుల ఆధ్వర్యంలో 10గంటలకు వేలం వేయునున్నట్లు, ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

ఈసీ నిర్ణయానికి కట్టుబడదాం

బీసి సంఘం

ప్రజాశక్తి- పుంగనూరు: రాష్ట్ర ఎన్నికల సంఘం ఓట్లు లెక్కింపు సందర్భంగా తీసుకున్న నిర్ణయానికి బీసీ సంఘం కట్టుబడి ఉంటుందని ఆ సంఘ నాయకుడు కష్ణమూర్తి అన్నారు. బీసీ నిర్ణయాన్ని కట్టుబడి పని చేద్దామని గురువారం పుంగనూరులో బీసీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బిసి సంఘ నాయకులు కష్ణమూర్తి మాట్లాడుతు రాష్ట్రంలో ఈనెల 13న నిర్వహించిన ఎన్నికలు శాంతియూతంగా రాజ్యాంగ బద్దంగా స్వచ్ఛందంగా ప్రజలు తమ ఓటు హక్కును నిర్వహించుకోవడం జరిగిందని, ప్రజాసంక్షేమం కోసం ప్రజలు నాయకులను ఎన్నుకోవడం కోసం ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఈసీ తీసుకొన్న నిర్ణయాలను తాము గౌరవిస్తున్నామన్నారు. ఇక రానున్న నాలుగవ తేదీ ఎన్నికల లెక్కింపులో ప్రజల నిర్ణయం మహాకూటమి ప్రభుత్వంను ఏర్పాటు చేయనున్నదని ప్రజలు ఈసీ నిర్ణయాల మేర జాగ్రత్తలు వహించి సంబరాలకు, తగాదాలకు కాలుదువ్వకుండా సహనంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో న్యాయవాది శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హంస వాహనంపై వీణాపాణి



ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హంస వాహనంపై సరస్వతీదేవిగా, ఉదయం చిన్నశేషవానంపై వేణుగోపాలుడు ఊరేగితూ భక్తులను అనుగ్రహించారు. రెండవ రోజు ఉదయం 7.30 నుంచి 9.30 గంటలకు ఐదు పడగల చిన శేష వాహనంపై శ్రీవేణుగానలోలుడు పురవీధుల్లో విహరించారు. స్వామి వారి వాహనం ముందు చెక్క భజనలు, కోలాటాలు, మేళ తాళాల నడుమ వాహనసేవ వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు అభిషేకం, శుద్ధి, తోమాల, పంచాంగ శ్రవణం అర్చన జరిపి తొలిగంటలో నై వేద్యం సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామివారికి ఊంజల్‌సేవ వేద మంత్రాలతో నేత్రపర్వంగా జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారు వీణ ధరించి సరస్వతీ రూపంలో హంస వాహనంపై ఆశీనులై పురవీధుల్లో విహరించారు. డెప్యూ ఏఈవో పార్ధసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్ కుమార్, షరాబ్‌బాబు, సురేష్, కంకణబట్టు నారాయణదాసరి, వేదపండితులు గోపాలాచారి, తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశంఒ 31వ తేదీ శుక్రవారం జరుగుతుందని ఎంపిడిఓ రాజేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని, ఎన్నికల నియమనిబంధనలకు లోబడి సమావేశం జరుగుతుందని, కనుక సభ్యులు, అధికారులు సకాంలో హాజరు కావాలని తెలిపారు.

తోట సుమతికి 'బంగారు నంది'

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు

గంగాధర నెల్లూరు మండలం నెల్లెపల్లి గ్రామ సచివాలయ ఉద్యోగిని తోట సుమతికి గానకళా సేవారంగంలో అత్యుత్తమ సేవలందించినందుకుగాను బంగారు నంది అవార్డును ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ద్వారా ప్రముఖ సినిమా దర్శకుడు, నటుడు క్రిష్టారెడ్డి బహుకరించారు. ఈ మేరకు హైదరాబాద్లోని రవీంద్ర భారతిలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన గాన పోటీలలో ప్రతిభ కనపరిచినందుకు సుమతికి బంగారు నంది మెమెంటోతో పాటు ప్రశంసపత్రాన్ని అందించారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభ కనపరిచిన సుమతిని పలువురు స్థానికులు ప్రశంసించారు.



కృష్ణారెడ్డి చేతుల మీదుగా నంది అవార్డు అందుకుంటున్న సుమతి

పరిశోధన ప్రాజెక్టుకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-గుడిపల్లి : ద్రావిడ విశ్వవిద్యాలయం సహకార పరిశోధన ప్రాజెక్ట్ కోసం ఏపీఎస్‌సిహెస్‌సి నుంచి ఆర్థిక సహాయాన్ని సాధించినట్లు విద్యా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.మెర్సీ జ్యోతి తెలిపారు. తిరుపతి క్లస్టర్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్ (హెచ్‌ఇపిబి) తిరుపతి క్లస్టర్ పరిధిలోని సంస్థలు చేపట్టే కార్యకలాపాల ఆధారంగా ఆహార సాంకేతికత, జీవవైవిధ్యం మరియు వ్యర్థాల నిర్వహణ వంటి మూడు ప్రధాన ప్రాధాన్యతలను గుర్తించిందని, క్లస్టర్ సబ్‌కమిటీ సంస్థగా ద్రవిడియన్ విశ్వవిద్యాలయం, ఎస్‌పిఎంవివి, ఐఐటి, ఐఐఎస్ఇఆర్, ద్రావిడియన్ విశ్వవిద్యాలయం కుప్పం క్యాంపస్ బయోడైవర్సిటీ రిజిస్టర్ల సష్టి- జీవవైవిధ్య పరిరక్షణను రూపొందించడం జరిగిందన్నారు. ఎస్‌పిఎంవివి, ఐఐటి సహకారంతో 'అత్యంత ప్రాముఖ్యత' అనే ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించిందని ఐసర్ తిరుపతి నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ఏపీఎస్‌సిహెస్‌సి ప్రతిపాదనను ఎంపిక చేసి, 24నెలల్లో ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకు రూ.8,78,000 ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కొలకలూరి మధు జ్యోతి విశ్వవిద్యాలయ విద్యా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.మెర్సీ జ్యోతి, బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరెడ్డి, ప్రాజెక్ట్ పరిశోధకులను అభినందించారు. రెక్టార్, ప్రొఫెసర్ టి.అనురాధ మరియు రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఏకె.వేణుగోపాల్‌రెడ్డిలు ప్రాజెక్ట్‌ని విజయవంతంగా పూర్తి చేసేందుకు తమ సహాయ, సహకారాలు అందించినందుకు తమ సంతోషాన్ని తెలియజేశారు.

విగ్రహావిష్కరణ పనులు వేగవంతం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు – వెల్లూరు రోడ్డు, గంగినేని సరస్సు ఒడ్డున, మరుదు పాండియార్ సోదరుల మెమోరియల్ పార్కులో కంచు విగ్రహ ఆవిష్కరణకు పనులు వేగవంతంగా చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం విగ్రహాలను అమర్చడం జరిగింది, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. త్వరలో వైభవంగ మరుదు పాండియార్ సోదరుల మెమోరియల్ పార్క్ ఆవిష్కరణ చేయనున్నట్లు తెలిపారు.



ట్యాక్సీ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి- పుంగనూరు

2024 సాధారణ ఎన్నికల సమయంలో బాడుగకు పెట్టిన వాహనాలుకు అద్దె చెల్లించాలని ట్యాక్సీ డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. స్థానిక రిటర్నింగ్ కార్యాలయం ఎదుట ఆర్ఓపై గురువారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల విధులు నిర్వహించడానికి ఆర్వో మధుసూదన్ రెడ్డి పట్టణంలోని పలు వాహనాలను అద్దెకు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల పోలింగ్ పూర్తి అయిన వెంటనే వాహనాలను నిలుపుదల చేయడం జరిగింది. కానీ ఎన్నికల విధుల్లో పనిచేసిన వాహనాల యజమానులకు, డ్రైవర్లకు సంబంధించిన బాడుగ డబ్బులు ఆర్వో చెల్లించలేదని ఆరోపించారు. ఎన్నికలు ముగిసి దాదాపు 20 రోజులు కావస్తున్న అప్పటి నుండి ఆర్ఓ తమకు రావలసిన బాడుగలను చెల్లించాలని పదేపదే అడిగిన ఆయన ఎంపీడీవోతో మాట్లాడి తీసుకోండని చెబుతున్నారని, తాము ఎంపీడీఓను అడగగా మాకు ఎలాంటి సంబంధం లేదని ఎన్నికల సంబంధించిన వాహనాల బాడుగులు ఎన్నికల అధికారి చెల్లించాల్సి ఉంటుందని కాబట్టి మీరు ఎన్నికల అధికారిని అడగాలని సూచించారని తెలిపారు. ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకోవడంతో విధిలేని పరిస్థితుల్లో రావలసిన బాడుగ కొరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇప్పటికైనా జిల్లా ఎన్నికల అధికారి దీనిపై దృష్టి సారించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్యాక్సీ డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ట్యాక్సీ డ్రైవర్లు

ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

రెవెన్యూ కార్యాలయం ఎదుట గ్రామస్తుల నిరసన



ప్రజాశక్తి- వి కోట: మండల పరిధిలోని బోయ చిన్నాగనపల్లి గ్రామపంచాయతీ నాయకనేరి గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని గ్రామస్తులు గురువారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నాయకనేరి గ్రామానికి చెందిన గ్రామకంఠం సర్వేనెంబర్ 221/1సిలో సుమారు 4.50 ఎకరాల భూముల్లో వంద కుటుంబాలు జీవిస్తున్నాయి. గతంలో గ్రామస్తుల తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం బోరును వేసించి గ్రామానికి తాగునీరు అందిస్తోంది. అయితే గత కొంతకాలంగా ఈ బావి ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఇదే అదనుగా గ్రామానికి చెందిన నారాయణస్వామి నాయుడు కుమారుడు రమేష్ బాబు తాగునీటి బావిని అక్రమంగా పూడ్చివేసి ఇల్లు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నాడని వారు ఫిర్యాదుల పేర్కొన్నారు. ఆక్రమణను అడ్డుకునేందుకు ప్రయత్నించిన గ్రామస్తులపై దౌర్జన్యానికి దిగడంతో చేసేదిలేక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి తహశీల్దార్ సురేష్ బాబుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. సమస్యపై స్పందించిన తహీశీల్దార్ వీఆర్ఓ ద్వారా విచారణ జరిపి ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షిస్తామని గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో వారు వెనుతిరిగారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిరాజు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మండలంలోని ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ రవిరాజు ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సదుపాలయాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాలలో వర్షాలు ఎక్కువ పడటం వల్ల ప్రతిఒక్కరూ వారి ఇంటి వద్ద నీళ్లు నిలవకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా, డెంగీ వంటి జ్వరాలు దోమల ద్వారా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంత ప్రజలకి అవగాహన కల్పించి వ్యాధికి గురైన వాళ్ళని గుర్తించి వారికి సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. డాక్టర్లు గౌరీ, బాలసుబ్రమణ్యం రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా బీసీజీ వ్యాక్సిన్ పంపిణీ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సోమల అడుసుపల్లి ఇరికిపెంట నంజంపేట పొదలకుంటపల్లి 81 చిన్న ఉప్పరపల్లి దిడ్డివారిపల్లి సబ్ సెంటర్లలో బీసీజీ వ్యాక్సిన్ వద్దులకు 18 సంవత్సరాలు పైబడిన వారికి వేశారు. వైద్యాధికారి జయసింహ మాట్లాడుతూ క్షయవ్యాధి రాకుండా ఉండేందుకు బిసిజి వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని ప్రతి గురువారం వ్యాక్సిన్ ఆయా సబ్ సెంటర్ల పరిధిలో వేస్తారని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని సబ్ సెంటర్లలో జరుగుతున్న వ్యాక్సినేషన్ ప్రక్రియను వైద్యాధికారి జయసింహ పరిశీలించారు. గురువారం దాదాపు 200 మందికి పైగా వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో సిహెచ్ఓ అమర్నాథ్, సూపర్వైజర్ ఇందిరావతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇరికిపెంట సబ్ సెంటర్లో వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

క్రైం న్యూస్

టీడీపీ నేతలపై వైసీపీ కార్యకర్తల దాడి

ప్రజాశక్తి - రామకుప్పం:

మండలంలోని ఆరుమానుపెంట గ్రామానికి చెందిన టిడిపి నేతలపై వైసిపి కార్యకర్తలు దాడి చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... బుధవారం రాత్రి సుమారు 8గంటల సమయంలో టీడీపి మాజీ ఎంపీటీసీ నరసింహులు అతని స్నేహితులు గణపతి, చంద్రబాబు బెంగళూరు నుండి కారులో వస్తుండగా వైసిపి కార్యకర్తలు సత్య, వెంకటేష్, చంద్రశేఖర్ కారును అడ్డగించారు. ఎన్నికల సమయంలో టిడిపికి అనుకూలంగా పనిచేశారని.. కక్షతో వారిపై దుర్భాషలాడి, కర్రలు, రాళ్లతో దాడి చేశారన్నారు. దీంతో వారు భయభ్రాంతులకు గురై అక్కడి నుంచి తప్పించుకున్నామన్నారు. తమకు వైసిపి కార్యకర్తల నుంచి ప్రాణభయం ఉందని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి పై కేసు నమోదు

ప్రజాశక్తి- పుంగనూరు

ప్రేమ పేరుతో నమ్మించి ఓ బాలికను ఆత్మహత్యయత్నానికి ప్రేరేపించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రతాపరెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు. చౌడేపల్లి మండలం దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లి ఆనంద్ (18) ఓ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి చివరకు తమవి వేరువేరు కులాలని తన తల్లిదండ్రులు చెప్పిన వారితోనే పెళ్లి చేసుకుంటానని నువ్వు ఏమైనా చేసుకొని చనిపోఅంటూ హుకుం జారీ చేయడంతో మనస్తాపానికి గురైన బాలిక ఈనెల 15న తన ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించగా బాలిక సోదరుడు గుర్తించి ఉరితాడుకు వేలాడుతున్న ఆమెను వెంటనే రక్షించి మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక మానసిక పరిస్థితి సరిగా లేదని, కోలుకోవాలంటే మరో రెండేళ్ల పడుతుందని వైద్యులు ధ్రువీకరించారు. దీంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రతాపరెడ్డి తెలిపారు.

దొంగలు అరెస్ట్



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలో వ్యవసాయ పొలాలకు చెందిన మోటర్లు, జెసిబిలలో బ్యాటరీలను, ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు అందిన ఫిర్యాదుపై ఎస్పీ ఆదేశాల మేరకు నగిరి డిఎస్పీ ఆధ్వర్యంలో కార్వేటినగరం ఇన్స్పెక్టర్ సత్యబాబు పర్యవేక్షణలో వెదురుకుప్పం పోలీసుస్టేషన్ పరిధిలో స్పెషల్ టీమ్ ఏర్పాటు చేయడం జరిగింది. వారు గురువారం ఉదయం పాతగుంట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండటంతో వారిని విచారించగా బ్యాటరీలు, మోటార్స్, మోటార్ సైకిల్లు దొంగతనాలు చేసినట్లు తెలిసిందన్నారు. సదరు నిందితులు సీజర్ల ప్రతాప్ (26), చిన్నంతరాజు జయరామరాజు (22), కామసాని రాజశేఖర్ (27)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అనంతరం వీరి వద్ద నుంచి ద్విచక్రవాహనాలు 3, మోటర్లు, బ్యాటరీలు స్వాధీనం చేసుకన్నారు. వీటి విలువ రూ.1,30,000లు వుంటుందని తెలిపారు.

హుండీ లెక్కింపులో చేతివాటం

ప్రజాశక్తి - ఐరాల: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఈవో వెంకటేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. అయితే హుండీ లెక్కింపు కార్యక్రమానికి దేవస్థాన సిబ్బందితోపాటు, క్షుణ్ణంగా తనిఖీ అనంతరం భక్తులను, అలాగే బ్యాంకు సిబ్బందిని అనుమతిస్తారు. బ్యాంకు అధికారి ప్రకాష్ బంగారు బిస్కెట్‌ను సంచిలో దాచుకోవడం సీసీ కెమెరాల ద్వారా ఆలయ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమంలో 200గ్రాములకు పైగా 10 లక్షల విలువైన బంగారు బిస్కెట్లను తస్కరించినట్లు సమాచారం రావడంతో... ఆ అధికారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారణ చేపడుతున్నారు. దీనిపై వివరాలు తెలియాల్సి ఉంది.

గృహ నిర్మాణాలను పూర్తిచేయాలి: డీఈ

ప్రజాశక్తి- సోమల: మండలంలో గృహనిర్మాణశాఖ ద్వారా గృహాలను నిర్మించుకుంటున్న లబ్ధిదారులు జూన్ నెలాఖరులోపు గహ నిర్మాణాలను పూర్తిచేసే విధంగా మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హౌసింగ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఈ మధుసూదన రెడ్డి కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశం లో ఆయన మాట్లాడారు. మండలంలో 2352 గహాలను ప్రభుత్వ మంజూరు చేయగా ఇప్పటివరకు 1400 గహాలు పూర్తయ్యాయని మిగిలిన 850 గహనిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసే విధంగా సిబ్బంది గృహలబ్ధిదారులను ప్రోత్సహించే విధంగా సలహాలు సూచనలు అందజేసినట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కూడా బిల్లులు ప్రతివారం లబ్ధిదారుల అకౌంట్లో పడుతూ వస్తూ ఉందన్నారు. హౌసింగ్ సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రికార్డులు ఎం బుక్కులు డాక్యుమెంట్స్ పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జవిద్ అలి, గణేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



- సమావేశంలో మాట్లాడుతున్న డీఈ

తాగునీటి ట్యాంకుల క్లీనింగ్

ప్రజాశక్తి - సోమల: మండలంలోని ప్రజలకు పంచాయతీల పరిధిలోని ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా అందించే తాగునీరు స్వచ్ఛమైనదిగా అందించాలన్నదే లక్ష్యంగా ఓవర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్ క్లోరినేషన్ చేస్తున్నట్లు ఈఓఆర్‌డి లక్ష్మీదేవి తెలిపారు. గురువారం ఇరికిపెంట నంజంపేట పంచాయతీల పరిధిలోని ఓవర్ హెడ్ ట్యాంకులను పంచాయతీ పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లి తర్వాత శుభ్రపరిచి క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సబిత, మేనక పాల్గొన్నారు.



ఓవర్ హెడ్ ట్యాంక్‌ను శుభ్రపరుస్తున్న పంచాయతీ కార్మికులు

సంక్షిప్త వార్తలు

ప్రమాదాలపై అవగాహన అవసరం

జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి



ప్రజాశక్తి- పుంగనూరు: అగ్ని ప్రమాదాలపై బోయకొండ గంగమ్మ దేవస్థానంలో పనిచేస్తున్న సిబ్బందికి అవగాహన అవసరమని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సి.పెద్దారెడ్డి అన్నారు. పుంగనూరు అగ్నిమాపక కేంద్ర పరిధిలో చౌడేపల్లి మండలం, దిగువపల్లి, శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానంలో గురువారం అగ్నిమాపక నిరోధక పరికరాలు తనిఖీ చేశారు. దేవస్థానంలో అగ్ని నిరోధక పరికరాలు వాటి పనితీరు పరీక్షించి ఇంకా కావలసిన పరికరాలు గురించి, బోయకొండ ఈవోకు పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ దేవస్థానంలో పనిచేయు సెక్యూరిటీ సిబ్బంది ఎలక్ట్రిసిటీ సిబ్బందికి అగ్ని నిరోధక పరికారాలు వాడు విధానం, ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ఎలా స్పందించాలి. ఎవరికి ఫోన్ చేయాలి అనే దానిపై అవగాహన కల్పించారు. కరపత్రాలు సిబ్బందికి పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో పుంగనూరు అగ్నిమాపకశాఖ అధికారి ఏన్. సుబ్బరాజు, బోయకొండ దేవస్థానం కార్యనిర్వహణ అధికారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం పుల్లూరు క్రాస్ రోడ్డులోని శ్రీధర్మరాజు గుడి వద్ద మొదటి రోజైన గురువారం శ్రీద్రౌపతి సమేత ధర్మరాజుల వారి మహాభారత యజ్ఞాన్ని పురోహితులు సాయిరాజు శర్మ వారిచే గణపతి పూజ, యజ్ఞ పూజలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలతో కలిసి చేసి ధ్వజారోహణం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా కుమారి, ఎత్తిరాజుల నాయుడు, స్వాతి, ప్రకాష్ నాయుడు వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త వేణు నాయుడు మాట్లాడుతూ ఎస్ఆర్ పురం భారత మిట్టలో జరుగు మహాభారత యజ్ఞానికి పరిసర ప్రాంత భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకోగలరని తెలిపారు.

4న ప్రజాకంఠక పాలనకు చరమగీతం



ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌లో ప్రజా కంఠక పాలనకు ప్రజలు చరమగీతం పడతారని రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. ఈసందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనతో రాష్ట్ర సమగ్ర అభివద్ధి సాధ్యమని ప్రజలు భావించారని, శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో టిడిపికి ప్రజలు పట్టంకట్టడం ఖాయమన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు స్వామి దాస్, జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, పార్లమెంట్ టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, జాన్, ఆర్ముగం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథ

ప్రజాశక్తి- సోమల

విరిగిపెంట పంచాయతీ వడ్డిపల్లి, తదితర గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో భారతం మిట్టలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో గురువారం బకాసుర వధ హరికథ కాలక్షేపం భక్తులను ఆకట్టుకుంది. ఏలూరు వాస్తవ్యులు సప్ప భారతి భాగవతారినిచే హరికథ కాలక్షేపం నిర్వహించారు. కళ్ళకు కట్టినట్టుగా కళ్ళ ముందు జరుగుతున్నట్లుగా హరికథ రాగయుక్తంగా చెబుతున్న హరికథ దాసు భారతికి భక్తుల నుండి విశేష స్పందన లభిస్తోంది. కాగా మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం బలి బండి సోమల నంజంపేట ఇరికిపెంట, చిన్న సోమల, నెల్లిమంద తదితర గ్రామాలకు భీముడి పాత్ర వేషధారితో వెళ్లి భక్తుల నుండి ప్రసాదాలను స్వీకరించి తిరిగి మహాభారత యజ్ఞం వద్దకు చేరుకున్నారు. అదేవిధంగా భక్తులు కానుకలను కూడా అందజేశారు.

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం వడ్డించాలి: ఎంఈవో

ప్రజాశక్తి-నాయుడుపేట

పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారంగానే మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈవో మునిరత్నం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు సీహెచ్ సరిత, శేఖర్, రిసోర్స్ పర్సన్‌గా రజిని, బాబు, రియాజ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్నం భోజనంలో అమలుపరిచే మెనూలోని సోమవారం నుండి శనివారం వరకు తయారు చేసే మెనూ నందు ఉపయోగించే పదార్థాలు, వండే విధానమును విపులంగా వివరించారు. మెనూ ప్రకారము విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయడం వల్ల వారికి మంచి పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. విద్యార్థులకు ఈ విధముగా పౌష్టికాహారం అందించడం వలన విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎంతో అభివద్ధి చెందుతారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం కచ్చితంగా అందించాలని మధ్యాహ్నం భోజనం నిర్వాహకులకు ఆయన స్పష్టంగా తెలిపారు.

పుత్తూరు టౌన్: పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించాలని పుత్తూరు మండల విద్యాశాఖ అధికారి తిరుమల రాజు పేర్కొన్నారు. పుత్తూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఎగువ కనకంపాలెంలో ప్రభుత్వపాఠశాలల్లో వంట చేసే సిబ్బందికి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు హరనాథ్, రఘు, సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.

పరామర్శ

ప్రజాశక్తి-డక్కిలి:

డక్కిలికి చెందిన పెంచలకోన మాజీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు చెలికం భాస్కర్ రెడ్డి ఇటీవల మతి చెందారు. గురువారం జరిగిన ఆయన ఉత్తరక్రియలు వెంకటగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పాల్గొని భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకు ముందు వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డుకు చెందిన వైసీపీ నాయకులు మేకల శ్రీనివాసులు సోదరుడు రమణయ్య మతి చెందడంతో గురువారం జరిగిన ఉత్తరక్రియలో నేదురుమల్లి పాల్గొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మండలానికి చేరిన విద్యాకానుక కిట్లు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వం అందజేస్తున్న విద్యా కానుక కిట్లు గురువారం మండలానికి చేరినట్లు అధికారులు తెలిపారు. ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు 805కిట్లు, ఐదవ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు 607ఇట్లు, తొమ్మిదవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు 381కిట్లు అందినట్లు అధికారులు వివరించారు. మండలానికి చేరుకున్న మొత్తం కిట్లు 2612కాగా ఈ కిట్లను మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్ ములుసుబ్రమణ్యం ఆధ్వర్యంలో భద్రపరచారు. ఈకిట్లను పాఠశాలలు పున:ప్రారంభించిన రోజు ఆయా పాఠశాలకు ఇవ్వనున్నట్లు ఎమ్మార్సీ సిబ్బంది తెలిపారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని టాస్కోఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు నేతత్వంలో జిల్లా గణాంక అధికారి నాగేంద్ర కుమార్, డిపిహెచ్ఎన్ఆ ఇన్‌ఛార్జ్ బేబీ రాణి, డిపిఓ ప్రకాష్‌లు అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పిల్లలు, గర్భవతులు, బాలింతలు రక్తహీనతతో మరణించరాదని, వారికి తగిన వైద్య సదుపాయాలు కల్పించి రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక కాన్పు హాస్పిటల్లోనే జరపాలని తెలిపారు. అలాగే బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని గర్భవతులను యుక్తవయసు పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి తక్కువగా ఉన్నవారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దివాకర్, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపుకు విశేష స్పందన

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్

నారాయ ణవనం మండల కేంద్రంలోని గ్రంథాల యంలో విద్యార్థులకు సమ్మర్ క్యా ంపు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను నుంచి విశేష స్పందన లభిస్తోందని గ్రంథాలయ అధికారి జీవన్ తెలిపారు. జూన్ 6వ తేదీ వరకూ ఈ క్యాంపు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.